

కొల్లాపూర్‌లోని సురభి రాజా బంగ్లా వద్ద ఆర్‌ఐడీ పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవాలకు కొనసాగుతున్న ఏర్పాట్లు

అభివృద్ధి పనులకు శ్రీకారం

6

- ముందుకు వచ్చిన పూర్వ విద్యార్థులు
- అచ్చంపేట ప్రభుత్వ కళాశాలలో ఆడిటోరియం నిర్మాణానికి భూమిపూజ



మంచినీటి ప్లాంటును ప్రారంభించిన పూర్వవిద్యార్థులు

చిట్టి బుర్రలు.. మెరుగైన ఆలోచనలు

6

- రెండో రోజు కొనసాగిన సైన్స్‌ఫేర్
- ప్రదర్శనలతో ఆకట్టుకున్న విద్యార్థులు



సైన్స్‌ఫేర్‌ను తిలకిస్తున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు



28న కొల్లాపూర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి రాక

- ఆర్‌ఐడీ పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవాలకు హాజరు
- ముఖ్యమంత్రి సభకు ఏర్పాట్లు ముమ్మరం

వివరాలు 6వ పేజీలో...

ఆంధ్రజ్యోతి నిఘా

బియ్యం.. మాయం



మహబూబ్‌నగర్ జిల్లా చిన్నదర్పల్లి వద్ద ఉన్న బియ్యం గోదాం

- 680 మెట్రిక్ టన్నులు కాజేసిన దొంగల ముఠా
- చిన్నదర్పల్లి సివిల్ సప్లయ్ గోదాం వద్ద గోల్‌మాల్
- మహబూబ్‌నగర్ జిల్లాకు సంబంధించి స్టాక్ నిల్
- దారిమళ్లిన దాదాపు రూ.3 కోట్ల విలువ చేసే రైస్
- నాలుగు రోజుల క్రితమే చర్యలకు రిపోర్ట్ రాశామన్న అధికారులు
- 'ఆంధ్రజ్యోతి' పరిశీలనకు వెళ్తే బుకాయించే ప్రయత్నం
- పౌర సరఫరాల శాఖలో ఆగని అవినీతి దందా

మహబూబ్‌నగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పౌర సరఫరాల శాఖను అవినీతి జలగలు పీల్చిపిప్పి చేస్తున్నాయి. ఆ శాఖపై ఎన్ని ఆరోపణలు వస్తున్నా అవినీతి ఆగడం లేదు. ఇప్పటికే ధాన్యం పక్కదారి పట్టిన విషయం వెలుగులోకి రాగా, తాజాగా బియ్యం మాయం చేసిన ముఠా ఆగడాలు వెలుగులోకి వస్తున్నాయి. ప్రభుత్వం కోట్ల రూపాయలు రుణం తెచ్చి, రైతుల నుంచి ధాన్యం సేకరించి మిల్లర్లకు ఇస్తోంది. మిల్లర్లు నిబంధనల మేరకు సమయానికి సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) ఇవ్వకపోగా, సరైన ప్రమాణాలు పాటించడం లేదన్న విమర్శలున్నాయి. పలుచోట్ల నాసిరకం బియ్యం సరఫరా చేస్తున్నారని తెలుస్తోంది. ఇన్ని అవరోధాల మధ్య సివిల్ సప్లయ్‌కి వచ్చిన బియ్యాన్ని ఓ దొంగల ముఠా మాయం చేసిన ఘటన మహబూబ్‌నగర్ సమీపంలోని చిన్నదర్పల్లి గోదాముల వద్ద చోటుచేసుకుంది. ఏకంగా 680 మెట్రిక్ టన్నుల బియ్యం మాయం కావడంతో గోదాం వెలవెలబోతోంది. ఈ విషయాన్ని నాలుగు రోజుల క్రితమే పసిగట్టిన సివిల్ సప్లయ్ అధికారులు రాష్ట్రస్థాయి అధికారులకు నివేదిక ఇచ్చారు.

బుకాయించే ప్రయత్నం

బియ్యం మాయమైన విషయం తెలుసుకున్న 'ఆంధ్రజ్యోతి' శుక్రవారం గోదాములను పరిశీలించింది. ముందుగా అక్కడ పనిచేసే సిబ్బందిని వాకబు చేయగా 20 రోజులుగా ఎఫ్‌సీఐలో బియ్యం లేవని, వచ్చిన వాళ్ళు వెనుదిరుగుతున్నారని తెలిపారు. గోదామ్‌ల వద్దకు వెళితే అక్కడ ఉన్న గోదాం మేనేజర్ ప్రవీణ్ బుకాయించే ప్రయత్నం చేశారు. తమ వద్ద బియ్యం నిలువలు పుష్కలంగా ఉన్నాయని, ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే గోదాములలో 17 వేల మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ గోదామ్‌లలో వేల మెట్రిక్ టన్నుల బియ్యం ఉన్నట్లు బుకాయించే ప్రయత్నం చేశాడు. స్టాక్‌కు సంబంధించిన పూర్తి వివరాలు చెప్పాలని కోరగా, తాను నేరుగా చెప్పలేనని ఆర్ఎం అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని అక్కడినుంచి జారుకున్నారు. తరువాత అధికారులను అడిగితే అక్కడ ఉన్నస్టాక్ ఇతర జిల్లాలకు సంబంధించినదని, మహబూబ్‌నగర్ జిల్లా స్టాక్ లేదని స్పష్టమైంది.

రూ.3 కోట్ల విలువ చేసే బియ్యం మాయం:

మహబూబ్‌నగర్ జిల్లాలోని పౌరసరఫరాలకు సంబంధించిన బియ్యం చిన్నదర్పల్లి గోదామ్‌లలో నిల్వ చేస్తారు. అక్కడి నుంచి ఎంఎల్ఎస్ పాయింట్(మండల్ లెవెల్ స్టాకెస్ట్ పాయింట్)లకు, అక్కడి నుంచి ఆయా మండలాలకు బియ్యం సరఫరా చేయాల్సి ఉంటుంది. అయితే ఎంఎల్ఎస్ పాయింట్‌లకు రాక ముందే బియ్యం మాయమవుతోంది. చిన్నదర్పల్లి గోదామ్‌లలో ప్రైవేట్, ప్రభుత్వం ఆధ్వర్యంలో గోదాంలను నిర్వహిస్తున్నారు. అందులో మహబూబ్‌నగర్ జిల్లాకు సంబంధించిన 680 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని దొంగల ముఠా మాయం చేసింది. ఈ బియ్యం విలువ దాదాపు రూ.మూడు కోట్ల వరకు

(మిగతా 6లో..)

రాజకీయ ప్రాధాన్యంతోనే..

బీసీలకు న్యాయం

- బీసీల రిజర్వేషన్ తగ్గించి, ఈడబ్ల్యూఎస్‌కి అవకాశం ఇవ్వటం అమానుషం
- బీసీ కమిషన్ బహిరంగ విచారణలో కుల సంఘాల నాయకులు

వివరాలు 7వ పేజీలో...

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని నాయకులు అభిప్రాయపడ్డారు. మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ ఆధ్వర్యంలో సామాజిక, విద్యా పరంగా వెనుకబడిన తరగతుల స్థితిగతుల అధ్యయనంలో భాగంగా శుక్రవారం బహిరంగ విచారణ చేపట్టారు. చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ హాజరైన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, పలువురు నాయకులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు.

- పాలమూరు, ఆంధ్రజ్యోతి



బీసీ కమిషన్ బహిరంగ విచారణలో ప్రసంగిస్తున్న చైర్మన్ గోపిశెట్టి నిరంజన్



బీసీలకు జీవనోపాధి చూపించాలి

- యెన్నం శ్రీనివాసరెడ్డి, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే

రాష్ట్రంలోని మూడు కోట్ల మంది బీసీలకు జీవనాధారం చూపించాలి. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల్లో అవకాశం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. గతంలో మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా కేంద్రంగా ఉండటంతో అందరూ అన్ని రకాల పనులు, ఉపాధి, వైద్యం కోసం వచ్చేవారు. నేడు రెండు డిగ్రీ కళాశాలలు, హాస్టల్స్ ఉన్నా సరిపోవటం లేదు. మరో రెండు డిగ్రీ కళాశాలలతో పాటు బాలికల, బాలుర హాస్టల్స్ ఏర్పాటు చేయాలి. ఏటీసీ(అడ్వాన్స్ టెక్నాలజీ కోర్సులు) సెంటర్లలో చదువుకునే విద్యార్థులకు కనీసం రూ.ఐదు వేల స్కాలర్‌షిప్ అందించాలి. బీసీలకు జనాభా ప్రాతిపదికన విధిగా నిధి కేటాయించి, వారి అభివృద్ధికే ఖర్చు చేయాలి.

బీసీలకు సమన్యాయం చేయాలి



ప్రభుత్వం బీసీలకు సమన్యాయం చేయటానికి చర్యలు తీసుకోవాలి. వాల్మీకులను ఎస్టీల్లో చేర్చి, రిజర్వేషన్లు అమలు చేయాలి.

- బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే గద్వాల

కాటన్‌మిల్లులో అగ్నిప్రమాదం

- రూ. లక్ష ఆస్తినష్టం

7



కాటన్‌మిల్లులో మండుతున్న పత్తి

బస్సు వేగంగా నడపటంతో ప్రయాణికులకు గాయాలు

- నాగర్‌కర్నూల్ పోలీస్ స్టేషన్‌లో ప్రయాణికుల ఫిర్యాదు : కేసు నమోదు

6

ఇందిరానగర్‌లో మహిళ మృతి

- భర్త చనిపోయిన నెల వ్యవధిలోనే భార్య మృతి

6

కొనుగోలు కేంద్రం వివాదంపై విచారణ

- గ్రామాన్ని పరిశీలించిన డీఎస్పీ సత్యనారాయణ

7



విచారణ నిర్వహిస్తున్న డీఆర్‌డీఏ అధికారులు

వ్యవసాయ అభివృద్ధికి కృషి

- ఎంఏ అక్బర్, జిల్లా హార్టికల్చర్ అధికారి



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

అయిజ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయాభివృద్ధి కోసం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్దేశించిన లక్ష్య సాధన కోసం పనిచేయాల్సి ఉంటుందని జిల్లా హార్టికల్చర్, సెరికల్చర్ అధికారి ఎంఏ అక్బర్ తెలిపారు. పండ్ల తోటలు, పట్టు సాగుపై రైతులు దృష్టి సారిస్తున్నారు. రైతులు పామాయిల్‌పై దృష్టి సారించాల్సి ఉంది. మా సహకారం, తోడ్పాటు ఎల్లవేళలా రైతులకు ఉంటుందని ఆయన అన్నారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలు వివరించారు.

ఏ పంటలు సాగుచేస్తే రైతులకు లాభదాయకం?

పామాయిల్ తోటలు సాగుచేస్తే రైతులకు లాభదాయకంగా ఉంటుంది. ఖరీఫ్‌లో వరి కోసం వెంటనే మొక్కలు నాటితే పంట మార్పిడి జరిగినట్లు ఉంటుంది. పొలానికి, రైతుకు లాభదాయకమైన పంటలు సాగుచేసి దిగుబడి సాధించినట్లు అవుతుంది. పెట్టుబడి ఖర్చు తక్కువ. దిగుబడి, లాభాలు లాభదాయకంగా ఉంటాయి. మూడు సంవత్సరాల తర్వాత గెలల దిగుబడి ఉంటుంది. చీడపీడల బెడద ఉండదు. పంట పొలంలో తేమ ఉండే విధంగా చూసుకుంటే సరిపోతుంది. మూడు నెలలకు ఒకసారి మొక్కకు కావాల్సిన ఎరువు అందచేస్తే సరిపోతుంది. అమ్మిన వెంటనే 4 రోజుల్లో రైతు ఖాతాలో జమ అవుతుంది.

ఈ పంట సాగుకు సహకారం ఎలా లభిస్తున్నది ?

ఈ పంట సాగుకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకారం అందిస్తుంది. మొక్కకు సబ్సిడీ అందించటంతో పాటు అంతర పంట సాగుకు, పెట్టుబడికి ప్రభుత్వం ప్రతీ సంవత్సరం ఎకరానికి రూ. 4,200 చొప్పున నాలుగు సంవత్సరాల వరకు అందచేయటం జరుగుతుంది. సమాచారం ఇస్తే ప్రభుత్వ ఉద్యోగులు పంట పొలం వరకు వచ్చి రవాణా ఖర్చులు ఇచ్చి గెలలు తీసుకెళ్లటం జరుగుతుంది.

పంట లాభదాయకమేనా?

సాగు లాభదాయకంగా ఉంటుంది. మొక్క పెట్టింది మొదలు రవాణ, కొనుగోలు వరకు ప్రభుత్వమే బాధ్యత వహిస్తుంది. మూడు సంవత్సరాల తర్వాత నెల నెల గెలలు వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వ ఉద్యోగిలా రైతు ప్రతి నెల దిగుబడి డబ్బులు అందుకునే అవకాశం ఉంది. 2 నెలల క్రితం టన్ను రూ. 14,400 ఉండగా ప్రస్తుతం రూ.19,144కు చేరింది. రైతులు ఎప్పుడు వేసే పంటలు కాకుండా పంట మార్పిడి చేపడితే రైతుకు, పొలానికి లాభదాయకంగా ఉంటుంది. సబ్సిడీపై డ్రిప్ అందిస్తాం.

చిట్టీలతో చీటింగ్



- జిల్లాలో గల్లిగల్లీలో నిర్వహణ
- 90 శాతం అనుమతి లేనివే
- నెల నెలా డబ్బులు కట్టించుకొని ముఖం చాటేస్తున్న నిర్వాహకులు
- లబోదిబోమంటున్న బాధితులు

వనపర్తి క్రైమ్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఈనెల నుంచి కొత్త చిట్టి ప్రారంభిస్తున్నాం ఎవరైనా చిట్టి వేసే వాళ్లు ఉంటే మమ్మల్ని సంప్రదించమంటూ ఇటీవలే సోషల్ మీడియాలో ఎక్కువగా ఇలాంటివే వైరల్ అవుతున్నాయి. మొదట్లో చిట్టి వేసే వాళ్లతో వేయించుకునే వాళ్లు చాలా నమ్మకంగా పరిచయం పెంచుకుని కట్టించుకుంటారు. మొదట్లో చెల్లింపులు బాగానే చేస్తారు. రాను రాను వారికి ప్రజలు అలవాటు పడిన తరువాత ప్లేట్ ఫిరాయిస్తున్నారు. ఇలా చిట్టీల పేరుతో జరిగిన మోసాలు ఇటీవల జిల్లాలో ఎక్కువగా వెలుగు చూస్తున్నాయి. రూపాయి రూపాయిగా కూడబెట్టుకున్న సొమ్ము మొత్తం కేటుగాళ్ల పాలవుతుండడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. ఆర్థికంగా నిలదొక్కుకోవడం, అవసరాల కోసం, పేద మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా చిట్టీలు వేస్తున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుంటున్న పలువురు అనుమతి లేకుండా చిట్టీలు నిర్వహిస్తున్నారు. సభ్యులు నగదు చెల్లించిన తరువాత కొందరు డబ్బుతో ఉడాయిస్తుండగా మరికొందరు డబ్బులడిగిన వారిని బెదిరింపులకు పాల్పడున్నట్లు సమాచారం.

ఒక్కొక్కరు ఐదు చిట్టీలపైనే

వనపర్తి జిల్లాలో గల్లీ గల్లీలో చిట్టిల వ్యాపారం నడుస్తుంది. ఒక్కొక్కరు అనుమతులు లేకుండా 5 నుంచి 10 చిట్టీల వరకు నిర్వహిస్తున్నారంటే అతిశయోక్తి లేదు. వీటిలో 90 శాతం వరకు అనుమతి లేనివే. చిట్టీలు నిర్వహించే వారు జిల్లా చిట్స్ రిజిస్టర్ కార్యాలయంలో అనుమతి పొందాల్సి ఉంటుంది. కానీ అలా జరగడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. 20 నుంచి 30 మందిని ఒక్క గ్రూపుగా ఏర్పాటు చేసి చిట్టీలు నడిపిస్తుంటారు. కొందరు అవసరమున్న సభ్యులకు డబ్బులు ఇవ్వకుండా ముఖం చాటేస్తుండటంతో బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు.

ఫిర్యాదు చేసేందుకు వెనుకడుగు..

చిట్టీల నిర్వాహకులు డబ్బులు ఇవ్వకుండా ఉడాయిస్తుంటే బాధితులు ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావడం లేదు. వ్యక్తిని నమ్ముకుని చిట్టీలు వేస్తుండటంతో బాధితులు నిర్వాహకుల దగ్గర ఎలాంటి రాతపూర్వకంగా పేపర్లు గానీ, ఆధారాలు గాని పెట్టుకోవడం లేదు. కేవలం చిట్టి ప్రారంభించినప్పుడు ఒక చిన్న బుక్కు మీద చిట్టి ప్రారంభమైన తేదీ, నెల ఎంత డబ్బులు కట్టారు అనేది ఒకటే నమోదు చేసి నిర్వాహకులు వారికి ఇచ్చేస్తున్నారు. దీంతో వారు ఉడాయించినప్పుడు ఎలాంటి ఆధారాలు లేకపోతుండటంతో దిక్కుతోచని పరిస్థితుల్లో అయిన వారి దగ్గర బాధలు చెప్పుకొని బోరుబోరుమంటూ విలపిస్తున్నారు.

ఇటీవల జరిగిన ఘటనలు

వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి మదనాపూర్ మండలంలోని ఓ ప్రభుత్వ కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తూ పలువురు ఉద్యోగులను నమ్మించి చిట్టీలు వేయించుకున్నాడు. రాను రాను అతను అక్కడ ఉద్యోగం మానేసి చిట్టీలు వేయించుకున్న వారికి డబ్బులు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ వచ్చాడు. చిట్టీలు వేసిన వారు గట్టిగా అడుగుతూ వస్తుండటంతో అతను వనపర్తి నుంచి హైదరాబాద్‌కు మకాం మార్చాడు. బాధితులు వారింటికి వెళ్తే మాకు ఎలాంటి సంబంధం లేదని సమాధానం ఇస్తున్నారు.

- గత రెండు నెలల క్రితం కొత్తకోటకు చెందిన ఒక వ్యాపారి తన దగ్గర చిట్టీలు వేసే వారిని బాగా నమ్మించి పెద్ద మొత్తంలో వేయించుకుని భార్యభర్తలిద్దరూ కలిసి కోటిన్నర పైగా రూపాయాలతో ఉడాయించారు.
- పట్టణానికి చెందిన ఓ వ్యక్తి తన స్నేహితునితో కలిసి గత కొన్నేళ్లుగా చిట్టీల వ్యాపారం చేస్తు వచ్చాడు. చిట్టీల నుంచి వచ్చిన లాభంతో రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులు పెట్టగా నష్టాలు రావడంతో అతను చిట్టి వేసిన వారికి కుచ్చుటోపి పెట్టి ఉడాయించాడు.

విద్యార్థినులతో కలిసి సహపంక్తి భోజనం



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)సంచిత్ గంగ్వార్‌తో కలిసి విద్యార్థులతో పాటు కలెక్టర్ ఆదర్శ్ సురభి సహపంక్తి భోజనం చేశారు. శుక్రవారం సాయంత్రం వనపర్తి పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఆదర్శ్ సురభి అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటకాలను పరిశీలించిన కలెక్టర్ సాంబార్‌లో ఏ కూరగాయలు వేశారు.. మెనూ ప్రకారం కూరగాయలు వండినారా అని ప్రశ్నించారు. వంటకు ఏ నీళ్లు వాడుతున్నారు అని ఆరా తీశారు. స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించిన కలెక్టర్ పిల్లలు చేతులు, ప్లేట్లు కడిగే చోట సబ్బులు ఉంచారా లేదా అని తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థినులతో కలిసి కూర్చొని సహపంక్తి భోజనం చేశారు. రోజు వంటకాలు ఇలాగే వంటాయా, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా, తరగతులు ఎలా జరుగుతున్నాయి అని విద్యార్థులతో ముచ్చటించారు. మీలో ఎవరైనా ఐఐటీలో సీటు సంపాదిస్తే తన ఇంటికి భోజనానికి పిలుస్తానని కలెక్టర్ హామీ ఇవ్వడంతో విద్యార్థినులు ఒక్కసారిగా కేరింతలు కొట్టారు. జిల్లా పౌర సంబంధాల అధికారి సీతారాం, జీసీడీవో శుభలక్ష్మి, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు వెళ్తూ.. అనంత లోకాలకు



సుల్తాన్(ఫైల్)

ఆత్మకూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తమ బంధువు అంత్యక్రియలకంటూ వెళ్తూ.. ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల పరిధిలోని పరమేశ్వర స్వామి చెరువు కట్ట సమీపంలో చోటు చేసుకుంది. మృతుడి కొడుకు ఎండీ ఉస్మాన్ ఫిర్యాదు మేరకు ఆత్మకూరు ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆత్మకూరు మండల పరిధిలోని కత్తెపల్లి గ్రామంలో తమ బంధువు చనిపోయాడని తెలిసి అంత్యక్రియలకని మదనాపూర్ మండలం దేవాలయ వీధికి చెందిన సుల్తాన్(75) స్కూటర్‌పై మధ్యాహ్నం రెండు గంటల సమయంలో బయలుదేరాడు. ఆత్మకూరు సమీపంలోని పిన్నంచర్ల క్రాస్ రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న టిప్పర్ అతివేగంగా వచ్చి స్కూటర్‌ను ఢీకొట్టడంతో సుల్తాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రాణపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతుండగా ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని వైద్యులు తెలిపారు. అతివేగంగా, అజాగ్రత్తగా టిప్పర్ నడిపిన వ్యక్తి రాయచూర్ జిల్లాకు చెందిన సంతోష్ అని తెలిసింది. టిప్పర్ యజమానిపై, డ్రైవర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎండీ ఉస్మాన్ ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఆత్మకూరు ఎస్ఐ నరేందర్ తెలిపారు.

చిట్టి బుర్రలు..
మెరుగైన ఆలోచనలు

- రెండో రోజు కొనసాగిన సైన్స్‌ఫేర్ - ప్రదర్శనలతో ఆకట్టుకున్న విద్యార్థులు

వనపర్తి రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న రాష్ట్ర 52వ బాల వైజ్ఞానిక దర్శిని, 12వ ప్రేరణ అవార్డుల కార్యక్రమం వనపర్తి పట్టణ కేంద్రంలో సూర్యచంద్ర ప్యాలెస్ హైస్కూల్లో రెండోరోజు కొనసాగింది. సైన్స్‌ఫేర్ జిల్లాలో 350 పాఠశాలల నుంచి విద్యా ర్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వివిధ పాఠశాల విద్యార్థులు ఒక్కొక్క రకంపై సైన్స్‌ఫేర్‌లో ప్రదర్శించారు. వైజ్ఞానిక ప్రదర్శనను తిలకించేందుకు వివిధ పాఠశాలల విద్యార్థులు ఆసక్తిగా వచ్చారు.


సైన్స్‌ఫేర్‌ను తిలకించడానికి వచ్చిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు


● బిందు సేద్యంపై పండించే పంటలపై రెండు రకాల ఆన్‌లైన్ డ్రిప్, ఇన్‌లైన్ డ్రిప్‌తో పండించే పంటలతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి వచ్చే విధంగా కేజీబీవీ వీపనగండ్ల విద్యార్థులు హర్షియా, భార్గవిల ప్రదర్శన ఆలోచింపజేసింది.


● పంటలను రక్షించుకోవడానికి పెన్సింగ్ నదుపాయంపై యూపీఎస్ నాగవరం విద్యార్థి వైష్ణవి సైన్స్‌ఫేర్‌లో ప్రదర్శన రూపంలో తెలియజేసింది. పంటలను రక్షించుకోవడానికి చాలా మంది రైతులు విద్యుత్ వైర్లను వాడడం వల్ల ప్రాణాలు కోల్పోతున్నారు. అలా కాకుండా లోవోల్టేజీతో పెన్సింగ్ వేస్తే కరెంటు షాక్‌కు గురికాకుండా అలారం మోగుతుందని ప్రదర్శించింది.

విద్యార్థులకు భద్రత ఇదేనా?

వనపర్తి పట్టణ కేంద్రంలోని సూర్యచంద్ర ప్యాలెస్ హై స్కూల్లో రెండో రోజు కొనసాగుతున్న సైన్స్ ఫేర్‌కు హాజరవుతున్న విద్యార్థులకు భద్రత కరువైంది. సైన్స్ ఫెయిర్‌కు తిలకించడానికి వివిధ మండలాల జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులను ఉపాధ్యాయులు తీసుకువస్తున్నారు. ఆటోలో, బొలెరోలో దాదాపు 50 మందికి పైగా తీసుకురావడం గమనార్హం.

ప్రయాణం ప్రమాదం అని తెలిసినా ఉపాధ్యాయులే పాటించకపోతే మిగతా వారి సంగతి ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత విద్యాశాఖ అధికారులు కాస్త విద్యార్థుల ప్రయాణంపై కాస్త దృష్టి పెట్టాలని పలువురు సూచిస్తున్నారు.


సైన్స్‌ఫేర్ తిలకించిన అనంతరం ప్రమాదపుటంచున ప్రయాణం చేస్తున్న విద్యార్థులు

● వాహనాలు వెళ్లినప్పుడు అవసరమున్న విద్యుత్‌ను ఆదా చేసే విధానంపై జడ్పీహెచ్ఎస్ పెద్దమందడి విద్యార్థులు సైన్స్‌ఫేర్‌లో ప్రదర్శించారు. కొన్ని పరికరాలతో వాహనాలు వెళ్లినప్పుడు మాత్రమే విద్యుత్ వెలగడం.. వాహనాలు రానప్పుడు విద్యుత్ ఆగిపోవడం వంటి విధానంపై ప్రదర్శించారు.



● ప్రతి మనిషి తీసుకునే శ్వాసపై సరస్వతీ శిశు మందిర్ వనపర్తి విద్యార్థులు ప్రదర్శన ద్వారా వివరించారు. ముక్కు ద్వారా శ్వాస తీసుకునేటప్పుడు ఊపిరితిత్తుల పనితీరులో సంకోచం వ్యాకోచం విధానంపై సైన్స్ ఫేర్‌లో ప్రదర్శించారు.




● ప్రజలు రోగాల బారినపడకుండా తీసుకునే విటమిన్‌పై కేజీబీవీ పాన్‌గల్ విద్యార్థులు ప్రదర్శన రూపకంగా తెలిపారు. ఈ మధ్యకాలంలో ప్రజలు షుగర్, బీపీలకు గురవుతున్నారని తీసుకున్న విటమిన్లపై చిరుధాన్యాలతో ప్రదర్శించారు. ఏ సమయంలో ఏ విటమిన్ తినాలి అనే విధానంపై తెలియజేశారు.


● వాటర్ ప్యూర్ రీసైక్లింగ్ చేసే విధానంపై టీజీఎంఆర్ఎస్ బాలుర కొత్తకోట విద్యార్థులు తమ ప్రదర్శనలో తెలియజేశారు. ఎటు వంటి కెమికల్ లేకుండా ఇసుకలో మట్టిలో వచ్చేటటువంటి నీటిని ప్యూర్ సైక్లింగ్ చేసే విధానంపై ప్రదర్శించారు.

28న కొల్లాపూర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి రాక

● జటప్రోల్ గ్రామంలో రూ.80 కోట్లతో ఇంటిగ్రేటెడ్ హాస్టల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన

● ఆర్ఐడీ పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవాలకు హాజరు

● సీఎం సభకు ఏర్పాట్లు ముమ్మరం

కొల్లాపూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రానికి ఈనెల 28వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రానున్నారు. ముఖ్యమంత్రి అయ్యాక తొలిసారి కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించబోయే ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ప్రైవేటు కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. ఈనెల 27, 28, 29వ తేదీలలో కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రంలో ఆర్ఐడీ పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. 27న ప్రారంభమయ్యే స్వర్ణోత్సవాలను సినిమా హీరో విజయ్ దేవరకొండ ప్రారంభించనున్నారు. 28న సీఎం హాజరుకానున్నారు. ముందుగా కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో పెంట్లవెల్లి మండలం జటప్రోల్ గ్రామంలో 80 కోట్ల రూపాయలతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టబోయే ఇంటిగ్రేటెడ్ హాస్టల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. జటప్రోల్ గ్రామంలోనే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సారథ్యంలో 20వేల మంది జనసమీకరణతో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ సభలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించనున్నారు. అక్కడి నుంచి మధ్యాహ్నం కొల్లాపూర్ పట్టణ కేంద్రంలో సురభి రాజా బంగ్లాలో నిర్వహించే ఆర్ఐడీ పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవాలకు హాజరవుతారు. గంట పాటు ఆర్ఐడీ ఉన్నత పాఠశాల కళాశాల విద్యార్థులతో సమావేశం అవుతారు. సీఎం పర్యటనలో భాగంగా కొల్లాపూర్ మండల కేంద్రంతో పాటు పెంట్లవెల్లి మండలం జటప్రోల్ గ్రామంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు ఇప్పటికే ఏర్పాట్లను ముమ్మరం చేశారు. కొల్లాపూర్ పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా దెబ్బతిన్న రహదారులను మరమ్మతులు చేస్తున్నారు.

29న మ్యూజిక్ డైరెక్టర్ తమన్ ప్రత్యేక కార్యక్రమం

ఆర్ఐడీ పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవాల్లో భాగంగా చివరి రోజు 29న కొల్లాపూర్ పట్టణంలోని రామాపురం రహదారిలో భారీ సెట్టింగ్‌తో మ్యూజిక్ డైరెక్టర్ తమన్ ప్రోగ్రాం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సినీ కళాకారులు యాంకర్లు ఆర్టిస్టులతో కొల్లాపూర్ మూడు రోజుల పాటు బిజీబిజీగా కళకళలాడనున్నది.

అభివృద్ధి పనులకు పూర్వ విద్యార్థుల శ్రీకారం

● అచ్చంపేట ప్రభుత్వ కళాశాలలో ఆడిటోరియం నిర్మాణానికి భూమిపూజ


భూమి పూజ చేస్తున్న పూర్వవిద్యార్థులు

అచ్చంపేటటౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : తాము చదివిన కళాశాలకు తమవంతుగా సహాయం అందించాలని పట్టణంలోని జూనియర్ కళాశాలలో చదువుకు న్న పూర్వవిద్యార్థులు పలు అభివృ ద్ధి పనులకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. అనూష ప్రాజెక్ట్సు ప్రైవేటు లిమిటెడ్ అధినేత జలంధర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర మాజీ చీఫ్ ఇంజనీర్ గణపతిరెడ్డి కళాశాలలో తాగునీటి ప్లాంట్‌తో పాటు 4 కంప్యూటర్లు, ఒక లాప్‌టాప్‌ను అందించారు. అదేవిధంగా కళాశాలలో ఆడిటోరియం నిర్మాణం కోసం ఆవరణలో భూ మిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇదే కళాశాలలో విద్యను అభ్యసించి ఉన్నతమైన స్థానంలో ఉన్నామన్నారు. తాము చదుకున్న కళాశాలలో విద్యార్థులకు తాగునీరు అందించడానికి తమ వంతుగా తాగునీటి ప్లాంటు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. కళాశాలలో మౌళిక వసతుల కోసం తమ వంతుగా కళాశాలకు సహాయం చేస్తుంటామన్నారు. అంతకు ముందు పూర్వవిద్యార్థులకు కళాశాల విద్యార్థులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుహాసిని, డీఐ వెంకటరమణ, అధ్యాపక బృందం విద్యార్థులు, తిరుపతిరెడ్డి, గోవర్ధన్, రేణయ్య పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్

గద్వాల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) ఉమ్మడి పాలమూరులో నాలుగు జిల్లాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో గద్వాల, వనపర్తి, నారాయణపేట, కల్వకుర్తి నియోకవర్గాలలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది.

రాష్ట్ర వ్యాప్తంగా 26 నియోజకవర్గాలలో ఈ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తుండగా ఉమ్మడి పాలమూరులో నాలుగు నియోజకవర్గాలు ఉన్నాయి. గద్వాల నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు చోటు కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డికి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, ఎంపీ డాక్టర్ మల్లురవికి జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత కృతజ్ఞతలు తెలిపారు.

పంచాయతీ ఎన్నికలకు సన్నద్ధం

● 75 శాతం సామగ్రి జిల్లాకు చేరింది

● ఎంపీడీవోలు పోలింగ్ స్టేషన్లను పరిశీలిస్తున్నారు

● జిల్లాలో 441 పంచాయతీలు.. 3,836 పోలింగ్ కేంద్రాలు

● మహబూబ్‌నగర్ జిల్లా పంచాయతీ అధికారి పార్థసారథి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



మహబూబ్‌నగర్ న్యూ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లాలో రానున్న గ్రామ పంచయతీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి పార్థసారథి తెలిపారు. ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు అందులో నిమగ్నమై ఉన్నారని చెప్పారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్, కలెక్టర్ ఆదేశాల మేరకు పక్రియ సజావుగా సాగుతోందని అన్నారు. శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఆ వివరాలు..

ఎన్నికలు ఎప్పుడు నిర్వహించే అవకాశం ఉంది?

రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న కులగణన పూర్తి అయిన అనంతరం ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. కులగణన అనంతరం ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లు మారే అవకాశాలు ఉన్నాయి. కొత్త రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నాం. మారే రిజర్వేషన్లతో వార్డు సభ్యులుగా, సర్పంచులుగా పోటీ చేసేందుకు కొత్తవారికి అవకాశాలు దక్కనున్నాయి.

కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయా?

పోలింగ్ బూతులు పరిశీలించి, వాటిలో ఏమైన మార్పులు, మరమ్మతులు ఉంటే వెంటనే చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం సర్క్యులర్ విడుదల చేసింది. 600 ఓటర్లకు పైబడి ఉన్న పోలింగ్ స్టేషన్ల పరిధిలో నూతన పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని గవర్నమెంట్ ఆదేశించింది.

జిల్లాలో ఎన్ని గ్రామ పంచాయతీలు ఉన్నాయి?

441 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 5.16 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో 3,836 కేంద్రాలు ఉన్నాయి. ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు పరిశీలిస్తున్నారు. ఎన్నికల నిర్వహణ కోసం వాటిలో మౌళిక వసతుల కల్పనకు చర్యలు చేపడుతున్నారు.

ఏమైన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయా?

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల జాబితా పోలీస్, రెవెన్యూ శాఖల వద్ద ఉంటాయి. ఆ కేంద్రాలలో గతంలో జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకుని, ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందుగానే అక్కడ తీసుకోవాల్సిన చర్యలను ఆ రెండు శాఖలు సంయుక్తంగా చేపడతాయి. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కృషి చేస్తారు.

ఎన్నికల సామగ్రి జిల్లాకు చేరిందా?

ఇప్పటి వరకు 75 శాతం ఎన్నికల సామాగ్రి జిల్లాకు వచ్చింది. పోటీ చేయబోయే వార్డు సభ్యులు, సర్పంచు అభ్యర్థుల ఫార్మాట్‌లతో పాటు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, ప్రిసైడింగ్ అధికారుల గైడ్‌లైన్స్‌తో కూడిన సామగ్రి ఉంది.

ఓటరు లిస్టు తుది జాబితా ఎప్పుడు విడుదల చేస్తారు?

గత సెప్టెంబరులోనే ఓటరు లిస్టు ఫైనల్ జాబితాను అప్‌డేట్ చేశాం. మండలాల్లో ఎంపీడీవోలు అప్‌డెట్ చేయాల్సిందిగా సూచనలు చేశాం. ఈ నెల 26న మండలాల్లో జాబితాను విడుదల చేస్తాం.

బియ్యం.. మాయం


గోదాంలో ఉన్న ఇతర జిల్లాల నిల్వలు

(మొదటి పేజీ తరువాయి)

ఉంటుంది. కొద్ది రోజుల క్రితం అక్కడి నుంచి బియ్యాన్ని తీసుకెళ్లేందుకు ఆర్‌వో(రిలీజింగ్ ఆర్డర్) తీసుకెళ్లిన వారికి అక్కడ నిల్వలు తెలువడంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు. విషయం కాస్త సివిల్ సప్లయ్ అధికారులకు తెలియడంతో నాలుగు రోజుల క్రితం గోదామ్‌ను తనిఖీ చేశారు. జిల్లాకు సంబంధించిన నిల్వలు లేకపోవడంతో, అక్కడ ఉండాల్సిన 680 మెట్రిక్ టన్నుల బియ్యం ఏమయ్యాయని ప్రశ్నించారు. దాంతో నిర్వాహకుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో చర్యలకు ఉన్నతాధికారులకు నివేదించారు. జిల్లాకు సంబంధించిన బియ్యం నిల్వలు లేకపోవడంతో ఇతర జిల్లాల స్టాక్ పాయింట్‌ల నుంచి బియ్యం తెచ్చి మండలాలకు సరఫరా చేస్తున్నారు. కాగా, జిల్లాలో కొద్ది రోజులుగా సరఫరా అవుతున్న బియ్యం బాగోలేవని, ఆ పాత బియ్యంలో పురుగులు, మెరికెలు ఎక్కువగా ఉంటున్నాయని పలువురు వాపోతున్నారు. కాజేసిన బియ్యం స్థానంలో ఇతర జిల్లాల నుంచి తెచ్చిన బియ్యం నాసిరకంగా ఉన్నాయా? అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రేషన్ దుకాణాలలోనే అవకతవకలు జరుగుతున్నాయని అనుకుంటే.. ఎల్ఎల్ఎస్ పాయింట్‌లు, ఎఫ్‌సీఐ గోదామ్‌ల వద్ద కూడా ప్రజా పంపిణీ బియ్యం దారి మళ్లడం, నాణ్యమైన బియ్యం స్థానంలో పాత, పురుగుల బియ్యం సరఫరా చేయడం వంటి అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. బియ్యం మాయం అయిన ఘటనపై సివిల్ సప్లయ్ అధికారులు ఉన్నతాధికారులకు రిపోర్టు పంపించి వారం గడుస్తున్నా, ఇప్పటికీ ఎలాంటి చర్యలకు ఉపక్రమించకపోవడం గమనార్హం. దాదాపు రూ.3 కోట్ల విలువ చేసే బియ్యం మాయం చేసి, ఇతర జిల్లాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి తెచ్చిన ముఠాపై మీనమేషాలు లెక్కించడం శోచనీయం.

హెడ్ ఆఫీస్‌కు రిపోర్ట్ చేశాం

గోదామ్‌లలో జిల్లాకు సంబంధించిన 680 మెట్రిక్ టన్నుల బియ్యం మాయమైంది. ఈ విషయంలో గోదాంను విజిట్ చేసి, హెడ్‌ఆఫీస్‌కు రిపోర్ట్ చేశాం. బియ్యం దొంగతనం అయిందా? ఏం చేశారో వాళ్లకే తెలియాలి. ఎస్‌డబ్ల్యూసీ(స్టేట్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్)కి చర్యలు తీసుకోవాలని రాసి పంపించాం. ప్రస్తుతానికి అక్కడ జిల్లాకు సంబంధించిన ఎలాంటి స్టాక్ లేదు. ఇతర జిల్లాల నుంచి స్టాక్ తెచ్చి సప్లయ్ చేస్తున్నాం.

- ఇర్ఫాన్, సివిల్ సప్లయ్ డీఎం, మహబూబ్‌నగర్

బస్సు వేగంగా నడపడంతో..
ప్రయాణికులకు గాయాలు

● నాగర్‌కర్నూల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

నాగర్‌కర్నూల్ క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ డిపోకు చెందిన బస్సు కొల్లాపూర్ నుంచి నాగర్‌కర్నూల్ వస్తుండగా పెద్దకొత్తపల్లి మండల పరిధిలోని చంద్రకల్ దగ్గర వేగంగా బస్సు నడపడంతో అందులోని ప్రయాణికులకు తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. బస్సు వేగంగా నడుపడంతో గుంతలు ఉన్న చోట బస్సు ఎగిరిపడటంతో ప్రయాణికులకు గాయాలయ్యాయి. ప్రయాణికులు సొప్పరి ఎల్లమ్మకు తీవ్ర గాయాలై, కాలు ఫ్రాక్చర్ అయ్యింది. శ్యామల, భాగ్యమ్మ, లక్ష్మమ్మ, అనూషలకు గాయాలయ్యాయి. ఈ ఐదుగురు నాగర్‌కర్నూల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఉప్పునుంతల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కంసానిపల్లి గ్రామ శివారులో డిండి వాగు అంచున ఉన్న ప్రభుత్వ భూమిలో ఇసుకను తవ్వితీస్తూ ట్రాక్టర్ లోడ్ చేశారు. పోలీస్ సిబ్బంది బ్లూకోట్ విధులు నిర్వహిస్తుండగా శుక్రవారం ఉదయం అనుమతులు లేకుండా ఇసుక లోడ్ చేస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ వెంకటరెడ్డి తెలిపారు. కంసానిపల్లి తండాకు చెందిన ముడావత్ నరేందర్ ట్రాక్టర్ ఓనర్ శ్రీనివాసులు ట్రాక్టర్‌తో పాటు వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బస్సు దిగుతూ కిందపడిన మహిళ మృతి


మదర్‌బీ బేగం(ఫైల్)

అచ్చంపేటటౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : భర్త చనిపోయిన నెల వ్యవధిలోనే భార్య మృతి చెందిన సంఘటన అచ్చంపేట పట్టణంలోని ఇందిరానగర్ చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని ఇంద్రనగర్ చెందిన మదర్‌బీ బేగం(60) ఆరోగ్యం బాగా లేకపోవడంతో మందుల కోసం అచ్చంపేట నుంచి నాగర్‌కర్నూల్ జిల్లాకు ఆర్టీసీ బస్సులో వెళ్లారు. నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రి ముందు బస్సు దిగుతుండగా బస్సు ఒక్కసారిగా కదలడంతో కిందపడి సొమ్మసిల్లి పడిపోయినట్లు వారు తెలిపారు. ఆమెను నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ ఆమె శుక్రవారం మృతిచెందినట్లు వారు తెలిపారు. ఇటీవలే అనారోగ్యంతో ఆమె భర్త నిరంజన్ మృతిచెందాడు. భర్త మృతిచెందిన 40 రోజులోనే భార్య మృతిచెందడంతో కాలనీలో విషాదఛాయలు నెలకొన్నాయి. ఆమెకు ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు.

బాలిక ఆత్మహత్యాయత్నం

కల్వకుర్తి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఓ బాలిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శుక్రవారం కల్వకుర్తి పట్టణంలో చోటు చేసుకుంది. కొల్లాపూర్ మండలం ఓ గ్రామానికి చెందిన ఓ బాలిక కల్వకుర్తిలో ఓ ఇంట్లో పని చేస్తుంది. శుక్రవారం బాతురూమ్ క్లీన్ చేసే యాసిడ్ తాగింది. దీంతో వెంటనే కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాలిక నుంచి డిప్యూటీ తహసీల్దార్ వాంగ్మూలం సేకరించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని మెరుగైన వైద్యం కోసం తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.


మద్దూర్ వెళ్లే రహదారిపై భూనీడు సమీపంలో రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంత


ఎర్రగోల్ తండా వద్ద పైపులైన్ కోసం తవ్వి పూడ్చకుండా వదిలేసిన గుంత

ప్రమాదాలకు రహదారి

● రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంతలు

● ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు, ప్రయాణికులు

కొత్తపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రధాన రహదారులపై అక్కడక్కడా ఏర్పడిన గుంతలు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలంలోని భూనీడు నుంచి మద్దూర్ వెళ్లే రహదారి మధ్యలో భూనీడు సమీపంలో ఓ గుంత ప్రమాదకరంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఈ గుంతల ఏర్పడిందని వాహనదారులు పేర్కొన్నారు. అదేవిధంగా ఎర్రగోల్ తండా వద్ద వ్యవసాయ పొలాలకు నీటి పైపులైన్ కోసం రోడ్డును తవ్విన రైతులు సగం వరకు రాళ్లు పెట్టారు. దీంతో ఈ దారి గుండా వెళ్లే వాహనదారులు రాత్రి సమయాల్లో ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రోడ్డు గుండా నిత్యం మద్దూర్ మండల కేంద్రానికి, మద్దూర్ నుంచి భూనీడు మీదుగా కొత్తపల్లి మండలంలోని దుప్పట్టిగట్టు, గోకుల్‌నగర్, తిమ్మారెడ్డిపల్లి, నందిగామ గ్రామాలతో పాటు, మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి రాకపోకలు కొనసాగిస్తుంటారు. వాహనదారులు వేగంగా ఉన్న సమయంలో గుంతలు కన్పించక ప్రమాదాలు జరిగే అవకాశాలు లేకపోలేదు. నిత్యం ఈ దారి గుండా ప్రయాణించే అధికారులు, ప్రజాప్రతినిధులు రోడ్డు మధ్యలో గుంతలు కన్పిస్తున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అధికారులు మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

స్పోర్ట్స్ బాక్స్

జాతీయ స్థాయి టోర్నీలో రాణించాలి

▸▸ జిల్లా విద్యాశాఖాధికారి ప్రవీణ్‌కుమార్



క్రీడాకారులను అభినందిస్తున్న డీఈవో ప్రవీణ్‌కుమార్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి టోర్నీలో రాణించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఏ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఎస్‌జీఎఫ్ అండర్-14 హ్యాండ్ బాల్ జాతీయ స్థాయి టోర్నీలో పాల్గొనే రాష్ట్ర జట్టుకు మహబూబ్‌నగర్ పట్టణంలోని అపెక్స్ సెంట్రల్ స్కూల్ విద్యార్థి జనార్దన్‌రెడ్డి, మహబూబ్‌నగర్ ఉన్నత పాఠశాల విద్యార్థి లాస్యప్రియ ఎంపికయ్యారు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించనున్న పోటీల్లో వారు పాల్గొననున్నారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో డీఈవో వారిని అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోటీల్లో రాణించి, ఉత్తమ క్రీడాకారులుగా ఎదిగితే క్రీడా కోటాలో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. జాతీయస్థాయి టోర్నీలో ప్రతిభ చాటి జట్టు విజయానికి కృషి చేయాలని కోరారు. అనంతరం వారు డీఈవోకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీఎంవో బాలుయాదవ్, ఎస్‌జీఎఫ్ అండర్-17 సెక్రటరీ శారదాబాయి, పీడీ వేణుగోపాల్, గ్రామర్ స్కూల్ ప్రిన్సిపాల్ శాంత, హ్యాండ్‌బాల్ సెక్రటరీ జియావుద్దీన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ అహ్మద్‌హుస్సేన్, శివుడు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కొండాపూర్ విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ధన్వాడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం కొండాపురం గురుకుల పాఠశాల విద్యార్థులు ఉదయకిరణ్, కార్తీక్, ఓంకార్, అరవింద్ రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ సబ్ జూనియర్ పోటీలకు ఎంపికయ్యారు. మెదక్ జిల్లాలోని మూసాపేటలో శుక్రవారం నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో మహబుబ్‌నగర్ జిల్లా జట్టు తరపున వారు పాల్గొననున్నారు. అలాగే ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు కొండాపూర్ ఎస్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు గణేష్, వంశీచంద్, సిద్ధు, శివకుమార్, కిషోర్, సతీశ్ ఎంపికయ్యారు. వారు మహబూబాబాద్ జిల్లాలోని కాల్వలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో మహబూబ్‌నగర్ జిల్లా జట్టు తరపున పాల్గొననున్నారు. ఈ సందర్భంగా వారిని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రాజారాం, కోచ్ రాంమోహన్‌గౌడ్, వైస్ ప్రిన్సిపాల్ సాంబయ్య, శ్రీనివాస్ నాయక్, పీఈటీ అంజనేయులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థి ఎంపిక



రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థితో ఉపాధ్యాయులు

కోయిలకొండ, అయిజ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ముసాయిబ్ అహ్మద్ అండర్ 14 రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు హెచ్‌ఎమ్ వెంకట్‌జీ తెలిపారు. ఈ నెల 23 నుంచి 25 వరకు హైదరాబాదులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో అహ్మద్ పాల్గొననున్నట్లు తెలిపారు. విద్యార్థిని అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో పీఈటీ మొగులాల్, పాల్గొన్నారు. అలాగే అయిజ పట్టణంలోని బ్రైట్‌స్టార్ పాఠశాల ఏడవ తరగతి విద్యార్థి కృష్ణ సాగర్ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు, కరస్పాండెంట్ ఎస్తేర్ దివ్య తెలిపారు.

టోర్నమెంట్‌లో విజేతగా నిలవాలి

▸▸ అథ్లెటిక్స్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర



ఉమ్మడి పాలమూరు జిల్లా సాఫ్ట్‌బాల్ బాలుర జట్టు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ టోర్నీలో జిల్లా జట్టు విజేతగా నిలువాలని అథ్లెటిక్స్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర అన్నారు. మెదక్ జిల్లా ముసాయిపేటలో ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్స్ సాఫ్ట్‌బాల్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాలుర జట్టు తరలివెళ్లింది. మహబూబ్‌నగర్ ఇండోర్ స్టేడియంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జట్టు సభ్యులను ఆయన అభినందించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో ప్రతిభ గల క్రీడాకారులకు కొదవలేదని, ఎంతో మంది రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించారని గుర్తుచేశారు. క్రీడాకారులందరికీ అసోసియేషన్ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్ కోచ్ సాధిక్‌అలీ, వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజు, రాఘవేందర్, మేరీ పుష్ప, సుగుణ, నాగమణి, కోచ్, మేనేజర్లు కిరణ్, శ్రీను, మోహన్ పాల్గొన్నారు.

భార్యను వేధించిన కేసులో

భర్తకు మూడేళ్ల జైలు శిక్ష

అమరచింత, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : భార్యను శారీరకంగా, మానసికంగా వేధించిన భర్తకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు వెల్లడించారు. అమరచింత ఎస్‌ఐ సురేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వనపర్తి జిల్లా అమరచింతకు చెందిన కృష్ణమూర్తి, తన భార్య రాధమ్మను మానసికంగా, శారీరకంగా వేధించేవాడు. వేధింపులు భరించలేక ఆమె 2017లో పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి హెడ్ కానిస్టేబుల్ జమీరుద్దీన్ కేసు నమోదు చేయగా, అప్పటి ఎస్‌ఐ సత్యానారాయణ రెడ్డి ఆత్మకూరు కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ప్రభుత్వ న్యాయవాది అరుణో దయ కుమార్ బాధితురాలి తరపున బలంగా వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో నిందితుడైన కృష్ణమూర్తికి న్యాయాధికారి మూడేళ్ల సాధారణ జైలు శిక్ష, రెండు వేల రూపాయల జరిమానా విధించారు. ఈ సందర్భంగా నిందితునికి శిక్ష పడేలా కృషి చేసిన పీపీ, ఎస్‌ఐలను ఎస్పీ రావుల గిరిధర్ అభినందించారు.

రాజకీయ ప్రాధాన్యంతోనే..

బీసీలకు న్యాయం

▸▸ వివిధ కుల సంఘాల నాయకుల అభిప్రాయం

▸▸ తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ ఆధ్వర్యంలో బహిరంగ విచారణ

పాలమూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాజకీయ ప్రాధాన్యంతోనే బీసీలకు సంపూర్ణ న్యాయం లభిస్తుందని వివిధ కుల సంఘాల నాయకులు అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో సామాజిక, విద్యారంగాల్లో వెనుకబడిన తరగతుల స్థితిగతుల అధ్యయనంలో భాగంగా, తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ పట్టణంలోని కలెక్టరేట్ సమావేశపు హాలులో బుధవారం బహిరంగ విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, వివిధ కుల సంఘాల నాయకులు, ప్రతినిధులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. జనాభా ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని, బీసీల్లోని అన్ని కులాలకు సమన్యాయం కల్పించాలని సూచించారు. బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ విచారణలో సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాల లక్ష్మీ రంగు, కలెక్టర్ విజయేందిర బోయితో పాటు ఉమ్మడి జిల్లా పరిధిలోని కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.



బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించాలి



కులవృత్తి లేక, ఉపాధి లేక అభివృద్ధికి ఆమడ దూరంలో వాల్మీకీ బోయలను ఎస్టీలుగా గుర్తించాలి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో వాల్మీకీ బోయలు అధికంగా ఉన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోని ఆంధ్ర, రాయలసీమ, కర్ణాటక ప్రాంతాల్లో వాల్మీకులు ఎస్టీలుగా, తెలంగాణలో బీసీలుగా ఉండటం బాధాకరం. వాల్మీకులకు విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజ్యాధికారంలో అవకాశం కల్పించి ఆదుకోవాలి.

- ఎంబీ బాలకృష్ణ,
వాల్మీకి సంఘం రాష్ట్ర నాయకుడు

వడ్డెరల అభివృద్ధికి తోడ్పడాలి



వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చి ఆదుకోవాలి. కులవృత్తి చేసుకోకుండా అటవీ శాఖ అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారు. వడ్డెరలకు రాజ్యాధికారంలో అవకాశం కల్పించాలి. సంచార జాతులుగా గుర్తించాలి. విద్య ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో ప్రాధాన్యం ఇవ్వాలి. కులవృత్తి చేసుకోవటానికి పనిముట్లు, పరికరాలను ఉచితంగా అందించాలి. వడ్డెరల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరించాలి.

- యాదయ్య,
వడ్డెర సంఘం నాయకుడు

ఎస్సీల కంటే దీనమైన బతుకులు



ముస్లింలు ఎస్సీల కంటే దీనస్థితిలో జీవితాలు గడుపుతున్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ పాలనలో ముస్లింకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించారు. 15 శాతం ఉన్న తమకు 15 శాతం రిజర్వేషన్లు కల్పించాలి. తెలంగాణ ఉద్యమ సమయంలో ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని హామీ ఇచ్చిన బీఆర్ఎస్ పార్టీ, అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయలేదు.

- ఎండీ మోసిన్,
మైనారిటీ నాయకులు, మహబూబ్‌నగర్

పుట్టుక నుంచి చావు వరకు..



మనిషి పుట్టుక నుంచి చావు వరకు మేదరుల అవసరం విడదీయలేనిది. పుట్టినప్పుడు చాటలో తీసుకు రావటంతో మా పని మొదలవుతుంది. ఆ తర్వాత ఊయల, మంచం తయారీ మా పనే. పెద్దయ్యాక పెళ్లి పందిరి కూడా మేమే. అలాగే కలప, జల్లెడ, ఇంటి నిర్మాణం, చివరికి పాడె వరకు మేదరుల అవసరం ఉంటుంది. మేదరులకు అవసరమైన ముడి సరుకు ఇచ్చి, కులవృత్తికి సహకారం సహకారం అందించాలి.

- రమాకాంత్, మేదర సంఘం
నాయకుడు, నాగర్‌కర్నూల్

అన్యాయానికి గురవుతున్నారు



కులవృత్తికి ఆదరణ లేక రజకులు అన్యాయానికి గురవుతున్నారు. ప్రభుత్వ ఆఫీసులు, కార్యాలయాలు, ఇతర కార్యాలయాల్లో దుస్తులు ఉతకటం, ఇస్త్రీ చేయడం వంటి కాంట్రాక్టులను రజకులకు ఇప్పించాలి. నేటికీ దుస్తులు ఉతికి ఇంటికి తెస్తే, నీళ్ల చల్లి తీసుకునే పరిస్థితి ఉంది. రాజకీయంగా అవకాశం కల్పించాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కేటాయించి ప్రాధాన్యం ఇవ్వాలి.

- విజయ్‌కుమార్,
రజక సంఘం నాయకుడు, వనపర్తి

కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి



సమాజంలో ఇప్పటికీ వీర ముష్టి (వీరభద్ర)లను హీనంగా చూస్తున్న పరిస్థితి ఉంది. మాకు వీరముష్టి (వీరభద్ర) పేరుతో కుల ధృవీకరణ పత్రాలు ఇవ్వాలి. గతంలో పచ్చబొట్లు వేసి అడుక్కునే వృత్తితో జీవనం గడిపాం. ఇప్పుడు ఉపాధి కరువై, వ్యాపారం చేసుకునే అవకాశమూ లేక అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాం. ప్రభుత్వం విద్య ఉపాధి, రాజ్యాధికారాల్లో అవకాశం కల్పించాలి.

- వెంకటయ్య,
వీరముష్టి సంఘం నాయకుడు

సామాజిక తెలంగాణ కోసమే..



సామాజిక తెలంగాణ కోసమే కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చింది. టీఆర్ఎస్ ప్రభుత్వం దానిని పూర్తిగా విస్మరించింది. అందుకోసమే కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో బీసీ, కులగణన చేయిస్తోంది. బీసీ కమిషన్ అందరి సమస్యలను వినడం, వినతులు తీసుకోవడం, ప్రజల స్థితిగతులపై అధ్యయనం చేయడం సంతోషం. బీసీ కమిషన్ చేస్తున్న కృషిని ప్రభుత్వం తప్పకుండా ఆమోదిస్తుంది. ముస్లింలు నేటికీ పాములు పట్టటం, బుక్కా తయారీ, రాళ్లు కొట్టడం, చేపలు పట్టడం వంటి పనులు చేస్తున్నారు. వారిని ఆదుకోవాల్సి ఉంది.

- ఒబేదుల్లా కొత్వాల్,
రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్

రిజర్వేషన్లు పెంచాలి



స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు పెంచాలి. రాష్ట్రంలో సమగ్ర కులగణనను అత్యంత పకడ్బందీగా చేపట్టి గణాంకాలను వెల్లడించాలి. జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి. విద్య, ఉద్యోగాల్లో బీసీ రిజర్వేషన్లను 27 శాతం నుంచి 50 శాతానికి పెంచాలి. సహకార బ్యాంకు ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలి. బీసీల సంక్షేమానికి ప్రతీ ఏటా రాష్ట్ర బడ్జెట్‌లో 50 శాతం నిధులు కేటాయించాలి. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ తరహాలోనే బీసీ సబ్‌ప్లాన్ ప్రవేశపెట్టి అమలు చేయాలి.

- రాచాల యుగంధర్‌గౌడ్,
బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్

51 శాతానికి తగ్గకుండా రిజర్వేషన్



రాష్ట్రంలో బీసీలకు 51 శాతానికి తగ్గకుండా రిజర్వేషన్ అమలు చేయాలి. ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న సమగ్ర కులగణనను చేపట్టడం సంతోషకరం. బీసీ, ఎంబీసీ, ఉత్పత్తి తదితర కులాలు ఇప్పటికీ విద్య, ఉపాధి, ఉద్యోగ, రాజ్యాధికారాల్లో చాలా వెనుకబడి ఉన్నాయి. రాజకీయ ప్రాధాన్యం లేని కులాలు ఇప్పటికీ చాలా ఉన్నాయి.

కులగణన ద్వారా రిజర్వేషన్లు కల్పించి, వారు చట్ట సభలలో కాలు మోపేందుకు అవకాశం కల్పించాలి. అలాగే కులవృత్తిపైనే ఆధారపడిన కులాలు చాలా ఉన్నాయి, వారి కోసం ప్రభుత్వం బీసీ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి ప్రతీ ఏటా ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించి సమగ్ర అభివృద్ధికి తోడ్పడాలి. బీసీల రిజర్వేషన్లను ఈడబ్ల్యుఎస్ పేరుతో అగ్ర వర్ణాలు తీసుకుపోవటం బాధాకరం.

- ఎం.శ్రీనివాస్,
బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు

మతోన్మాద రాజకీయాలు దేశానికే ప్రమాదం

▸▸ సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎల్ పద్మ

నారాయణపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ మతోన్మద రాజకీయాలతో బారతదేశానికే ప్రమాదం వాటిల్లుతోందని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎల్ పద్మ విమర్శించారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ గార్డన్‌లో సీపీఎం, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సదస్సుకు ఆమె ముఖ్య వక్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను నమ్మిందే ఇతరులు నమ్మాలని, తాను అచరించిందే ఇతరులూ ఆచరించాలని కోరుకుంటున్న బీజేపీ సిద్ధాంతం దేశానికే ప్రమాదమన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్రామిరెడ్డి, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి బి.రాము మాట్లాడుతూ భారతమాతకు జై అంటునే, మరో వైపు బొగ్గు, విద్యుత్, విమానయానం తదితర దేశ సంపదను కారుచౌకగా బడా పారిశ్రామిక వేత్తలకు అప్పజెప్తున్నారని విమర్శించారు. పెరుగుతున్న సంపద సంపన్నుల పాలవుతోందని, అహర్నిశలు శ్రమిస్తున్న కార్మికులకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత లేదని, పీఎఫ్, ఈఎస్ఐ వంటి చట్టబద్ధమన సౌకర్యాలు అమలు కావడం లేదని విమర్శించారు. సదస్సులో కాశీనాథ్, బాల్‌రామ్, సలీం, గోపాల్, అంజలయ్య గౌడ్, జ్యోషి, అశోక్, నరహరి, హన్మంతు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎల్ పద్మ

కొనుగోలు కేంద్రం వివాదంపై విచారణ

గద్వాల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, గద్వాల మండల పరిధిలోని బీరోలు గ్రామంలో కొనుగోలు కేంద్రం ప్రారంభం సందర్భంగా గురువారం జరిగిన వివాదంపై అధికారులు విచారణ నిర్వహించారు. అధికారపార్టీలోని రెండు వర్గాల మధ్య ఘర్షణ జరగడంతో కొనుగోలు కేంద్రం ప్రారంభం వాయిదా పడింది. ఈ నేపథ్యంలో అడిషనల్ పీడీ నర్సింహులు, డీపీఎం రామ్మూర్తి, ఏపీఎం పారిజాత శుక్రవారం గ్రామానికి వెళ్లి విచారణ నిర్వహించారు. గ్రామ సమాఖ్య ఏ సంఘానికి తీర్మానం చేసింది, దానిని రద్దు చేస్తూ మరో సంఘానికి అనుకూలంగా ఎందుకు తీర్మానం ఇచ్చింది తదితర కారణాలపై విచారణ నిర్వహించారు. మహిళా సంఘాల మధ్య విభేదాలు లేవని, రాజకీయ కారణాలు, నాయకుల పట్టుదలలే ఘర్షణకు కారణమని గుర్తించారు. రాజకీయ నాయకుల జోక్యం లేకుండా మహిళా సంఘాలతో శనివారం సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకుంటామని వారు తెలిపారు. కాగా డీఆర్‌డీఏ అధికారుల విచారణపై గ్రామ సమాఖ్యకు సమాచారం లేకపోవడంతో అధ్యక్ష, కార్యదర్శులు అందుబాటులో లేరు. దీంతో అధికారులు నిర్ణయం తీసుకోకుండా శనివారానికి వాయిదా వేశారు. గురువారం అధికార పార్టీలోని రెండు వర్గాలు బాహాబాహీకి దిగడంతో డీఎస్పీ సత్యనారాయణ, ఎస్ఐ శ్రీకాంత్ శుక్రవారం గ్రామంలో పర్యటించారు. స్థానికులతో మాట్లాడి ఘర్షణకు కారణాలను ఆరా తీశారు. కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అంచనా వేసేందుకు కేంద్రాన్ని తనిఖీ చేశారు. కాగా కొనుగోలు కేంద్రం ప్రారంభంపై ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత వర్గీయుల మధ్య పోటీ నెలకొనడం అధికారులకు తలనొప్పిగా మారింది.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో

ఇద్దరికి జైలు శిక్ష

▸▸ మరో ఇద్దరికి జరిమానా

ఖిల్లాఘణపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన నలుగురికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పునిచ్చినట్లు ఎస్ఐ సురేశ్ గౌడ్ తెలిపారు. వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండల పరిధిలో మద్యం తాగి వాహనం నడుపుతూ నలుగురు వ్యక్తులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డారు. పోలీసులు వారిని శుక్రవారం వనపర్తి జిల్లా కోర్టులో హాజరు పరిచారు. వారిలో ఇద్దరికి మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు వెల్లడించారు. అలాగే మరో ఇద్దరికి వెయ్యి రూపాయల చొప్పున జరిమానా విధించారు.

కాటన్‌మిల్లులో

అగ్ని ప్రమాదం

గద్వాల క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఓ కాటన్ మిల్లులో షార్ట్‌సర్క్యూట్‌లో అగ్ని ప్రమాదం జరిగి లక్ష రూపాయల ఆస్తినష్టం సంభవించింది. శుక్రవారం సాయంత్రం ఈ సంఘటన జరిగింది. ఫైర్ సిబ్బంది, బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని మేలచెర్వు రోడ్డులో ఉన్న ఉరుకుంద వీరన్నగౌడు కాటన్‌మిల్లులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించి మంటలు చెలరేగాయి. దీంతో పత్తి దగ్ధమై లక్ష రూపాయల ఆస్తి నష్టం సంభవించింది. సకాలంలో ఫైర్ సిబ్బంది వెంకటయ్య, బుగ్గన్న, కృష్ణయ్య సందీప్‌లు సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేయడంతో ఆస్తి నష్టం ఎక్కువగా జరగలేదని స్థానికులు తెలిపారు.

ఇన్నోవేషన్ - 101కు

బొంకూరు యువకుడికి ఆహ్వానం

అలంపూర్ చౌరస్తా, నవంబరు 22, (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'ఇన్నోవేషన్ - 101'కు గ్రామీణ యువకుడు తయారు చేసిన కారు ఎంపికయ్యింది. జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని బొంకూరు గ్రామానికి చెందిన బీచుపల్లి అలియాస్ అఖిల్ అనే ఆటో డ్రైవర్ పాత విడి భాగాలతో బ్యాటరీ సాయంతో నడిచే కారును చేశాడు. గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన టీఎస్ ఇన్నోవేషన్‌లో ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నాడు. దీనికి సంబంధించి ప్రభుత్వం హైదరాబాదులో 'ఇన్నోవేషన్-101' పేరుతో శనివారం బుక్‌లెట్‌ను విడుదల చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 'ఇంటింటా ఇన్నోవేటర్'లో భాగంగా తయారు చేసిన 101 పరికరాల వివరాలను పొందుపరిచారని బీచుపల్లి తలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు తనకు నిర్వాహకుల నుంచి ఆహ్వానం అందిందని ఆయన చెప్పారు.



ఇన్నోవేషన్-101 ప్రదర్శనకు ఎంపికైన కారు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

మద్యం తాగి వాహనాలు నడుపొద్దు

- ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి



పెబ్బేర్ రూరల్ , నవంబరు 22, (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనాలు నడుపొద్దని, ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలియజేశారు.

బహిరంగ ప్రదేశంలో మద్యం తాగితే ఎలాంటి చర్యలు తీసుకుంటారు.?

మద్యం తాగి వాహనాలు నడిపినా, బహిరంగ ప్రదేశంలో మద్యం తాగినా.. కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

డ్రంకెన్ డ్రైవ్ వారంలో ఎన్ని రోజులు నిర్వహిస్తారు?

ప్రతీ రోజు డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహిస్తాం. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తాం.

ఇసుక అక్రమ రవాణాను ఎలా అరికడుతారు.?

ప్రభుత్వ అనుమతితో ఇసుకను తరలించాలి. అక్రమగా ఇసుకను తరలిస్తే పట్టుకొని కేసులు నమోదు చేస్తాం.

ఫ్రేండ్లీ పోలీసుపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారా?

గ్రామాల్లో వివిధ సందర్భాల్లో ఏర్పాటు చేస్తున్న కార్యక్రమాల్లో ఫ్రెండ్లీ పోలీస్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలకు ఇబ్బందులు కలిగినప్పుడు నేరుగా పీఎస్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని కళాజాతా బృందంతో ప్రజలకు వివరిస్తున్నాం.

సైబర్ నేరాలపై ఎలాంటి అవగాహన కల్పిస్తున్నారు?

ప్రజలు వారి వ్యక్తిగత వివరాలను కొత్త వ్యక్తులకు, ఆన్‌లైన్‌లో తెలియకూడదని గ్రామాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. బ్యాంకు ఖాతా వివరాలను ఫోన్ చేసి అడిగినా.. ఎవరికీ తెలియజేయకూడదు. అలా చేస్తే పోలీసులను సంప్రదించాలి. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

న్యూస్ బాక్స్

వనపర్తి డీఈవోగా మహమ్మద్ అబ్దుల్ ఘని



మహమ్మద్ అబ్దుల్ ఘని

వనపర్తి రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా విద్యాశాఖ అధికారిగా మహమ్మద్‌గని బాధ్యతలు చేపట్టనున్నారు. ఆయన నారాయణపేట, గద్వాల జిల్లాలకు డీఈవోగా పనిచేసి బదిలీపై ఇక్కడికి వచ్చారు. వనపర్తి, జిల్లా డీఈవోగా ఉన్న గోవిందరాజులు నారాయణపేట గద్వాల జిల్లాకు బదిలీ అయ్యారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతి పత్రం అందజేస్తున్న కరుణశ్రీ

పెబ్బేరు, నవంబరు 22, (ఆంధ్రజ్యోతి) : పెబ్బేరు మునిసిపాలిటీలో సమస్యలు పరిష్కరించాలంటూ రాష్ట్ర మునిసిపల్ కమిషనర్ టీకే శ్రీదేవిని పెబ్బేరు మునిసిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ కలిసి వినతి పత్రం ఇచ్చారు. పట్టణంలో పలు సమస్యలు నెలకొన్నాయని వాటిని పరిష్కరించాలని కోరారు. దీనికి కమిషనర్ సానుకూలంగా స్పందించి వీలైనంత త్వరగా సంబంధిత అధికారులకు సంప్రదించి పట్టణ సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు చైర్‌పర్సన్ కరుణశ్రీ తెలిపారు.

ఎడ్యుకేషనల్ రెసిడెన్షియల్ హబ్‌గా వనపర్తి

వనపర్తి టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషనల్ రెసిడెన్షియల్ హబ్ ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో వనపర్తి కీర్తి కిరీటంలో మరో కలికితురాయి అని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ రెసిడెన్షియల్ హబ్‌కు వనపర్తి నిలయంగా మారనుందని, నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషనల్ హబ్ నిర్మాణానికి ప్రభుత్వం ఆమోద ముద్ర వేస్తు శుక్రవారం జారీ చేసిందని తెలియజేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఆత్మకూరు, నవంబరు 22, (ఆంధ్రజ్యోతి) : ఆత్మకూరుకు చెందిన శంకర్, సుజాత దంపతులు కుటుంబ కలహాల కారణంగా గత శనివారం భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. మనస్తాపానికి గురైన శంకర్ ఆదివారం ఆత్మకూరు పరమేశ్వర స్వామి చెరువు కట్టపై పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన వాహనదారులు శంకరును ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి అక్కడి నుంచి వనపర్తి జిల్లా ఆసుపత్రికి తరలించారు. రెండు రోజుల అనంతరం పాలమూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా పరిస్థితి విషమించి గురువారం అర్ధరాత్రి మృతి చెందినట్లు ఏఎస్‌ఐ బీమపల్లి తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చలిలోనూ చన్నీళ్లే..

- స్నానాలు చేసేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న కస్తూర్బా విద్యార్థులు

పెబ్బేర్ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం చలి తీవ్రత పెరిగింది. చలికి చిన్నారులు గజగజ వణుకుతున్నారు. పెబ్బేరు కస్తూర్బా పాఠశాలలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు 219 మంది విద్యార్థులు ప్రతీ నిత్యం ఉదయం స్నానాలు చేయడానికి తీవ్ర అవస్థలు పడుతున్నారు. పాఠశాలలో ఈ ఇబ్బందులు తొలగించేందుకు గత ప్రభుత్వం రూ.లక్షలు ఖర్చు చేసి పాఠశాలలపైనే సౌర యంత్రాలను ఏర్పాటు చేసింది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం కాంట్రాక్టర్లు ఇష్టవచ్చినట్లు బిగించి వెళ్లిపోయారు. కొన్ని నెలలు పనిచేసి... ఆ తరువాత సోలార్ యంత్రాలు మరమ్మతులకు గురయ్యాయి. దీనికి తోడు త్రీ ఫేస్ విద్యుత్తు సౌకర్యం లేకపోవడంతో సౌర యంత్రాలు రన్ కావడంలేదు. విద్యుత్తును ఏర్పాటు చేయాలని పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నత అధికారులకు తెలియజేసినా.. ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. వేడి నీటిని ఏర్పాటు చేయాలని విద్యార్థులు మొర పెట్టుకుంటున్నా.. ఎవరూ పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పనిచేయని సౌర యంత్ర పరికరం



పెబ్బేరులోని కస్తూర్బా గాంధీ పాఠశాల

ఉన్నతాధికారులకు తెలియజేశాం..

పాఠశాలపై ఏర్పాటు చేసిన వేడి నీటి యంత్రం పనిచేయడంలేదు. రిపేరు చేయించాలని ఉన్నత అధికారులకు, ఎమ్మెల్యేకు తెలియజేశాం. విద్యుత్తు సమస్య ఉన్నందున యంత్రం రన్ కావడంలేదు. విద్యుత్తు సమస్యను పరిష్కరించాలి. ప్రస్తుతం విద్యార్థులు బోరు నీటితో స్నానాలు చేస్తున్నారు.

- పద్మ, పెబ్బేరు కస్తూర్బా గాంధీ పాఠశాల ఎస్‌వో

మెనూ ప్రకారం భోజనం అందించాలి



వెల్టూరు జ్యోతిరావుపూలే రెసిడెన్షియల్ పాఠశాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

పెద్దమందడి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, శుభ్రతతో కూడిన భోజనం అందించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని వెల్టూరుని జ్యోతిరావుపూలే బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతిగృహంలో ఆహార పదార్థాల నాణ్యత, వాటి గడువు తేదీ పరిశీలించడంతో పాటు స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆహార పదార్థాలు వచ్చినప్పుడు అవి ఎన్ని వచ్చాయి, వాటి నాణ్యత ఎలా ఉంది అనేది విద్యార్థుల కమిటీ ద్వారా పరిశీలన జరిపి రిజిస్టర్‌లో వారి సంతకం తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు ఏమైనా ఉన్నాయా, మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని ఆరా తీశారు. తహసీల్దార్ సరస్వతి, ఆర్‌ఐ గణేష్, పంచాయతీ కార్యదర్శి వెంకటస్వామి పాల్గొన్నారు.

కొత్తకోట : ప్రభుత్వ గురుకుల, సంక్షేమ వసతిగృహాల్లో మెనూ ప్రకారంగా విద్యార్థులకు నాణ్యవంతమైన భోజనం అందించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం అమడబాకులలోని మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఆహారాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఎంఈవో కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

వనపర్తి రాజీవ్‌చౌరస్తా : సంక్షేమ హాస్టళ్లు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో భోజనం కలుషితం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం ఐడీవోసీ సమావేశ మందిరంలో సంక్షేమ శాఖల అధికారులు, విద్యాశాఖ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. ఇటీవల ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీలు, వసతిగృహాల్లో, మధ్యాహ్న భోజనంలో కలుషిత ఆహారం తిని పిల్లలు అస్వస్థతకు గురవుతున్న నేపథ్యంలో వనపర్తి జిల్లాలో ఇలాంటి సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతీ వసతి గృహంలో, విద్యాలయాల్లో స్టాక్ రిసిప్ట్ రిజిస్టర్, రోజు వారీగా స్టాక్ ఇచ్చే రిజిస్టర్లు ఖచ్చితంగా పెట్టాలని తెలిపారు. అన్ని చోట్ల ఒక ఫుడ్ సూపర్‌వైజర్‌ను, విద్యార్థులతో మెస్ కమిటీని ఏర్పాటు చేసి ఆహార పదార్థాల బాధ్యతలు అప్పగించాలని సూచించారు. అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) సంచిత్ గంగ్వార్, (రెవెన్యూ) వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యానికి అనుగుణంగా చదవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న సంచిత్ గంగ్వార్

వనపర్తి రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటికి అనుగుణంగా చదవాలని అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ సూచించారు. జిల్లాలోని అన్ని కేజీబీవీలు, ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు ప్రతీ శుక్రవారం స్ఫూర్తి పేరుతో కెరీర్ గైడెన్స్, పరీక్షల సన్నద్ధతపై తరగతులు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం వనపర్తి కస్తూర్బా బాలికల విద్యాలయంలో 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థినులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడారు. విద్యార్థులు బాల్యం నుంచే ఒక నిర్దేశిత లక్ష్యాలను ఎంచుకోవాలని వాటికి అనుగుణంగా చదవాలని సూచించారు. డాక్టర్ కావాలన్న, బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగం సంపాదించాలన్న ఎలాంటి కోర్సులు తీసుకోవాలి, వాటికి ఏవిధంగా సిద్ధం కావాలి అనేది విద్యార్థులకు వివరంగా వివరించారు. వైద్య రంగంలో ఎన్ని రకాల కోర్సులు ఉన్నాయి, వాటిని సాధించడానికి పోటీ పరీక్షలు ఏ విధంగా ఉంటాయో తెలియజేశారు. పదో తరగతి పరీక్షలు, ఇంటర్మీడియట్ పరీక్షలను ఎలాంటి భయం లేకుండా రాయాలని, ఇప్పటి నుంచే ఒక పద్ధతి ప్రకారం చదివితే సులువుగా మంచి మార్కులు సాధిస్తారని సూచించారు. జిల్లా వైద్య అధికారి డా.శ్రీనివాసులు, ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డా.రామచంద్రరావు సైతం వైద్య విద్యపై తమ విద్యా అనుభవాలను వివరించారు. కార్యక్రమంలో జీసీడీవో శుభలక్ష్మి, స్కూల్ అసిస్టెంట్ కిరణ్, శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లో సన్న వడ్ల బోనస్ జమ

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సన్న వడ్లు అమ్మిన రైతుల ఖాతాల్లో క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ జమ అవుతున్నట్లు అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు కోసం జిల్లాలో మొత్తం 403 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా... అందులో 260 సన్న వడ్ల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే 201 కేంద్రాల్లో కొనుగోలు ప్రారంభమైనట్లు వివరించారు. ఇప్పటి వరకు 10,089 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు తెలిపారు. ఇప్పటికే 54 మంది రైతుల ఖాతాల్లో క్వింటాల్‌కు రూ.500 చొప్పున 331.040 మెట్రిక్ టన్నుల ధాన్యానికి రూ.16,55,200 బోనస్ జమ చేశామని వివరించారు.

హైకోర్టు కౌన్సిల్‌కి సన్మానం



భాస్కర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ఆత్మకూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ హైకోర్టు కౌన్సిల్‌గా నియమితులైన ఆత్మకూరు ప్రముఖ న్యాయవాది విజయ భాస్కర్ రెడ్డిని ఆత్మకూరు మండలంలోని ఆయా గ్రామాల ప్రముఖులు కౌన్సిలర్లు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్ యాదవ్ మాట్లాడారు. ఆత్మకూరు జూనియర్ సివిల్ కోర్టు న్యాయవాదిగా ఉంటూ హైకోర్టు స్థాయికి ఆత్మకూరు వాసి ఎదగడం ఆత్మకూరు మండలానికి గర్వకారణమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అశ్వినికుమార్, మండ్ల రామకృష్ణ, రాములు, తిరుపతన్న, కృష్ణయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం



అమరచింతలో అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ సురేష్

ఆత్మకూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానంగా నేరస్తులను గుర్తించడంలో పని చేస్తుందని ఆత్మకూరు సీఐ శివకుమార్, ఎస్‌ఐ నరేందర్‌లు అన్నారు. మండల పరిధిలోని మేడపల్లిలో సీసీ కెమెరాలు ఏర్పాటు నిమిత్తం శుక్రవారం గ్రామస్థులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. గ్రామ ప్రధాన రహదారులు, చౌరస్తాలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అవగాహన కల్పించారు. అందుకు గ్రామస్థులు ముందుకు వచ్చి గ్రామంలో పది సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు. ముందుగా గ్రామంలోని దాతలు రూ.20 వేల ఎస్‌ఐ నరేందర్‌కు అందజేశారు. కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుల్స్ బాలరాజు, సత్యనారాయణ, ఇమామ్‌తో పాటు మేడపల్లి గ్రామస్థులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి

అమరచింత : సైబర్ నేరాలపై కస్తూర్బా బాలికల విద్యార్థులకు శుక్రవారం ఎస్‌ఐ సురేష్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడారు. విద్యార్థులు సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలని కోరారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు సైతం అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి ఓ టీపీ నంబర్లు, ఏటీఎం కార్డు పిన్ నంబర్లు అడిగితే ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వరాదని సూచించారు.

నిధులు మంజూరు చేయాలి



అనిల్ కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

కొత్తకోట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్ర సమీపంలోని శ్రీకృష్ణ ఆలయ కామన్‌హాల్ నిర్మాణానికి రూ.ఇరవై లక్షల నిధులు మంజూరు చేయాలని రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్‌యాదవ్‌కు విజ్ఞప్తి చేసినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పెంటన్న యాదవ్ శుక్రవారం తెలిపారు. అనిల్ కుమార్ యాదవ్‌ను హైదరాబాద్‌లో హాల్‌నిర్మాణం గురించి కలువగా.. తప్పకుండా నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు చెప్పారు. ఎంపీని కలిసిన వారిలో కమిటీ సభ్యులు బాలకొండన్న, సాయిలు యాదవ్, శంకర్ యాదవ్, రాములు యాదవ్, లక్ష్మయ్య, సాయిరాం ఉన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం బుచ్చన్న

వీపనగండ్ల, నవంబరు 22 , (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రంగవరం గ్రామంలో శుక్రవారం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం బుచ్చన్న ప్రారంభించారు. నాణ్యమైన ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకు రావాలని రైతులకు తెలిపారు. 14 శాతం తేమ ఉన్న సన్న ధాన్యాన్ని 17 శాతం లోపు తేమ ఉన్న లావు రకం ధాన్యాలను కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రైవేటు వ్యక్తులకు అమ్మి మోసపోవద్దని ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న కొనుగోలు కేంద్రాల్లో అ మ్ముకోవాలని తెలిపారు.

సీసీ వీరయ్య, రామకుల బిచ్చన్న, సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

నేడు కురుమూర్తికి డీకే అరుణ రాక

అమరచింత, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కురుమూర్తి స్వామిని దర్శించుకునేందుకు శనివారం ఎంపీ డీకే అరుణ రానున్నారని కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు క్యామ భాస్కర్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పేదల తిరుపతిగా పేరు గాంచిన కురుమూర్తి జాతరకు ఎంపీ డీకే అరుణ హాజరై ప్రత్యేక పూజలు చేస్తారని చెప్పారు. కార్యకర్తలు హాజరుకావాలన్నారు.

మాలల సింహగర్జన పోస్టర్ విడుదల



పోస్టర్‌ను విడుదల చేస్తున్న మాల మహానాడు నాయకులు

వనపర్తి టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : హలో మాల, చలో హైదరాబాద్ మాలల సింహ గర్జన పోస్టర్‌ను శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మాల మహానాడు నాయకులు విడుదల చేశారు. డిసెంబరు 1న జరిగే మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాదారి భోజరాజు, మొలకలపల్లి మద్దిలేటి, మోజర్ల కృష్ణ, సహదేవ్, రఘురాం, మాదారి బాలస్వామి, కురిటి నరేష్, రాజు, కురుమూర్తి, రంగస్వామి పాల్గొన్నారు.

పంట అవశేషాలకు నిప్పుతో భూసారం తగ్గుముఖం



మూలమల్లలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈవో మహేష్

ఆత్మకూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పంట అవశేషాలకు నిప్పు పెట్టడంతో పొగ దుమ్ము ధూళి వాతావరణంలో కలిసిపోయి పర్యావరణానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉందని ఏఈవో మహేష్ పేర్కొన్నారు. ఆత్మకూరు క్లస్టర్ పరిధిలోని మూలమల్లలో వరి రైతులకు అవగాహన కల్పించారు. వరి కొయ్యలకు నిప్పు పెట్టడంతో నేలకు మేలు చేసే క్రిమికీటకాలు నశించి పోవడమే కాకుండా భూసారం తగ్గిపోయే అవకాశం ఉందన్నారు. విపరీతమైన వేడితో భూమి సారాన్ని కోల్పోతుందన్నారు. నత్రజని పాస్పరస్ వంటి పోషక పదార్థాల శాతం తగ్గి దిగుబడి తగ్గిపోయే అవకాశం ఉందని అవకాశం కల్పించారు. కార్యక్రమంలో రైతులు నరసింహారెడ్డి, సుధాకర్, బాల్‌రాజు, గజేంద్ర రెడ్డి, వెంకటన్న, సహదేవుడు, కురుమూర్తి పాల్గొన్నారు.

పిల్లల భవిత కోసం పాదయాత్ర



మాట్లాడుతున్న విజయ్‌కుమార్

పెద్దమందడి, నవంబరు 22, (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో నైతిక విద్య, పరివర్తనపై అవగాహన కల్గించేందుకు బాపు బాటలో సత్యశోధన పాదయాత్ర చేస్తున్నట్లు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా విశ్రాంత డీఈవో విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని జడ్పీహెచ్ఎస్ మద్దిగట్ల- మోజర్ల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు గద్వాల కృష్ణ అధ్యక్షతన విజయ్‌కుమార్ విద్యార్థులతో అవగాహన తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహాత్మాగాంధీ జీవితం ఆధారంగా తీసుకొని నైతిక విలువలతో కూడిన జీవితం కొనసాగించాలన్నారు. అందుకు విద్యార్థి దశ నుంచే సమయపాలన, పుస్తక పఠనాభిలాష, పర్యావరణ పరిశుభ్రత, క్రమ శిక్షణ, నైతిక విలువలు మొదలైన అంశాలను అలవర్చుకోవాలని తెలియజేశారు. వక్త నాగేంద్రస్వామితో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, భగవంతు, పుల్లయ్య, మధుసూదన్, వాణి, ప్రభ, వెంకటస్వామి పాల్గొన్నారు.

రాష్ట్రంలో టీడీపీ బలోపేతానికి కృషి



జనార్దన్‌తో సభ్యత్వం తీసుకుంటున్న రామన్‌గౌడు

పెబ్బేర్ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో టీడీపీ బలోపేతం కోసం కృషి చేస్తానని రాష్ట్ర కార్యదర్శి రామన్‌గౌడు అన్నారు. శుక్రవారం ఏపీ రాష్ట్రంలో మంగళగిరిలో జరిగిన టీడీపీ జాతీయ సమావేశంలో పాల్గొని జాతీయ పోలిట్ బ్యూరో సభ్యుడు జనార్దన్‌తో సభ్యత్వం తీసుకున్నాడు. ఈ సందర్భంగా మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల్లో టీడీపీ సభ్యత్వాల పునరుద్ధరణ చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ సంవత్సరం నుంచి ఆన్‌లైన్‌లో నమోదు కార్యక్రమాన్ని చేపడుతానన్నారు.

సభ్యత్వం తీసుకున్న వారికి రూ.5 లక్షల ప్రమాద బీమా, కార్పొరేట్ హాస్పెటల్‌లో వైద్యం అందించడం జరుగుతుందన్నారు.

బీసీలకు సముచిత స్థానం కల్పించాలి



బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌కు వినతిపత్రం అందజేస్తున్న వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు దాసర్ల భూమయ్య

ఖిల్లాఘణపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలోని బీసీలకు ప్రభుత్వం సముచిత స్థానం కల్పించాలని శుక్రవారం వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు భూమయ్య, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు దేవరకొండ విజయ్, గంగపుత్ర సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నరేందర్, బీసీ కులస్తుల సంక్షేమ విచారణలో భాగంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బీసీ కమిషన్ కమిటీ చైర్మన్ నిరంజన్‌కు వినతిపత్రం అందజేశారు. వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరారు. రజకులు ఆర్థిక అభివృద్ధి సాధించడానికి ప్రభుత్వం సహకరించాలని రజక సంఘం జిల్లా అధ్యక్షుడు విజయ్ వినతిపత్రం అందజేశారు. గంగపుత్రుల సమస్యలు పరిష్కరించాలని మత్స్యకారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గాండ్ల నరేందర్, బీసీ కమిషన్‌ను కోరారు. గంగపుత్రులు విద్య ఉపాధి రాజకీయ రంగాల్లో వెనుకబడి ఉన్నారని గుర్తు చేశారు.

దివ్యాంగుల పింఛన్లు రూ.6 వేలకు పెంచాలి



దివ్యాంగులతో కలిసి మాట్లాడుతున్న కొమ్ము చెన్నకేశవులు మాదిగ

వనపర్తి టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం దివ్యాంగులకు పెన్షన్ రూ.6 వేలకు పెంచాలని ఎమ్మార్పీ ఎస్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము చెన్నకేశవులు మాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో వికలాంగులతో సమావేశమైన మాట్లాడారు. కొత్త పెన్షన్లు లేక అర్హులకు పెన్షన్ రాక గోసపడుతున్న వారి సమస్యలను పరిష్కరించాలని, అర్హులైన ప్రతీ ఒక్కరికి పెన్షన్లు అందించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి రిలే నిరాహార దీక్షలు ప్రారంభిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు గోపినాథ్, నాగేషు, కుమార్, గంధం కృష్ణ, గంధం లక్ష్మయ్య, శ్రీనివాసులు, నాగరాజు , మధు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక



కార్యవర్గాన్ని సన్మానిస్తున్న రాష్ట్ర నాయకులు

వనపర్తి టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా మహాసభ శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎంవైఎస్ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా నూతన అధ్యక్షుడిగా అర్జున్, ప్రధాన కార్యదర్శిగా శంకర్ నాయక్, కోశాధికారిగా గోపాలల్ నాయక్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర నాయక్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బిచ్చా నాయక్, రాష్ట్ర కార్యదర్శి బాలు నాయక్, జిల్లాలోని అన్ని శాఖల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో బీజేపీదే క్రియాశీలక పాత్ర



మాట్లాడుతున్న సర్పంచుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి

వనపర్తి రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాబోయే స్థానిక ఎన్నికల్లో బీజేపీ క్రియాశీలకంగా ఉంటుందని సర్పంచుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి అన్నారు. శుక్రవారం వనపర్తి మండల పరిధిలోని మెంటపల్లి, కడుకుంట్ల గ్రామాల్లో మండల పార్టీ అధ్యక్షుడు సందా వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షుడు రామన్నగారి వెంకటేశ్వర్ రెడ్డి, అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్, శక్తి కేంద్ర ఇన్‌చార్జి తిరుమలయ్య యాదవ్ సమక్షంలో బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షులను ఎన్నుకున్నారు. పోలింగ్ బూత్ నంబర్ 186 మెంటపల్లి అధ్యక్షుడిగా మంద సోమన్న, కడుకుంట్ల పోలింగ్ బూత్ కమిటీల అధ్యక్షులు 181 బూత్ అధ్యక్షులు నరేష్ యాదవ్, 182వ బూత్ అధ్యక్షులు చింతకాయల ఆంజనేయులు, 183బూత్ అధ్యక్షులు మర్థగళ్ల తిరుమలేష్, 184 బూత్ అధ్యక్షులు బొడ్డుపల్లి తిరుపతయ్య, 185వ బూత్ అధ్యక్షులు మర్థగాళ్ల రాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీని గెలిపించేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని అన్నారు.